
సాక్షి
పల్నాడు
మంగళవారం । 3 । జూన్ । 2025



గుట్టలు తొలగించేది ఎప్పుడో!

తెనాలిఅర్బన్: పట్టణంలోని తూర్పు కాల్వలో ఉన్న వ్యర్థాలను ఇరిగేషన్ అధికారులు పక్కన రోడ్డుపై వేశారు. ఇలా జరిగి 10 రోజులు దాటుతున్నా తొలగించలేదు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,292 క్యూసెక్కులు విడుదలవుతోంది.



శివాలయానికి బారికేడ్లు విరాళం

పెదకాకాని: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం ఇర్లపాడుకి చెందిన ఆరుమళ్ల వెంకటరావు, అనూష దంపతులు 25 బారికేడ్లను శివాలయానికి సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

6న ఐటీఐ అభ్యర్థులకు కౌన్సెలింగ్

మాచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మాచర్లలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో కౌన్సెలింగ్ జరుగుతుందని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు సోమవారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్స్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు మాచర్ల ఐటీఐ కాలేజీలో సంప్రదించాలన్నారు.

నేడు లక్ష్మీ వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం



పాత పాలువాయి(రెంటచింతల): పాత పాలువాయి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వినాయకస్వామి ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి శివ ప్రసాద్ సోమవారం తెలిపారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

ఘనంగా త్రిశక్తి పీఠం నాలుగవ వార్షికోత్సవం



పెదకూరపాడు: పెదకూరపాడులోని మహాలక్ష్మీ మహా సరస్వతి సమేత శ్రీ వాసవీ మాత దేవస్థానం నాలుగో వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో యజ్ఞ హోమాది కార్యక్రమాలు జరిగాయి. అమ్మవార్లను చందనంతో అలంకరించారు. సోమవారం రాత్రి భక్తులకు వేద ఆశీర్వచనాలు నుంచి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బావిలో జారిపడి విద్యార్థి మృతి



నూజెండ్ల: పొలంలోని వ్యవసాయ బావిలో జారిపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని తంగారాల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పమిడి ఏడుకొండలు, నాగరాజ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ (21) బీటెక్ రెండో సంవత్సరం గుంటూరులో చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన ఏడుకొండలు తండ్రికి సాయంగా పొలం వెళ్లాడు. దాహం తీర్చుకోవటానికి బావిలో దిగాడు. ఆ క్రమంలో జారిపడటంతో బావి లోతుగా ఉండటంతో మునిగిపోయి ఉంటాడని బంధువులు భావిస్తున్నారు. బావి సుమారు 25 అడుగుల లోతు ఉంటుందని, 6 ఇంజన్లు సాయంతో నీరు తోడటంతో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్సై ఎంవీ కృష్ణారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జేఈఈలో వీరవట్నం విద్యార్థికి 22వ ర్యాంకు



రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం గ్రామానికి చెందిన అడుసుమల్లి మోహన్ సాత్విక్ జేఈఈ–2025 అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా 22వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. మోహన్ సాత్విక్ తండ్రి అడుసుమల్లి రవికుమార్‌ది వీరవట్నం గ్రామం. ఉద్యోగరీత్యా రాజస్థాన్‌లోని అలెన్‌కోటలో స్థిరపడ్డారు. 10వ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివిన సాత్విక్ ఇంటర్మీడియట్‌ను రాజస్థాన్‌లోనే పూర్తి చేశాడు. రవికుమార్, మనీషా దంపతులకు సాత్విక్ మొదటి సంతానం. రెండో కుమారుడు రిత్విక్ 10వ తరగతి చదువుతున్నాడు. తమ గ్రామానికి చెందిన మోహన్ సాత్విక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి 22వ ర్యాంకు సాధించటం పట్ల వీరవట్నం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తల్లికి వంచన

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై తల్లుల ఆగ్రహం

''నీకు రూ.15 వేలు...నీకు రూ.15 వేలు... ముగ్గురుంటే రూ.45 వేలు'' ఈ మాటలు ఎక్కడో విన్నట్లు ఉంది కదా. సరిగ్గా ఏడాది కిందట(ఎన్నికల ముందు) చంద్రబాబు ఆ పార్టీ నాయకులు తల్లులకు ఇచ్చిన హామీ. తీరా అధికారంలోకి వచ్చాక ఆ మాటను మరిచారు. తల్లికి వందనం అంటూ వంచించారు. రెండో ఏడాది కూడా డబ్బులు ఇస్తారో లేదో తెలియదు. కూలినాలి చేసుకునే తల్లిదండ్రులు పిల్లలను బడులకు పంపేందుకు అవస్థలు పడుతున్నారు. కొంతమంది మధ్యలో చదువులకు స్వస్తి పలుకుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తీరుపై విద్యార్థుల తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్


- కూటమి ప్రభుత్వంలో దగా పడ్డ తల్లులు, విద్యార్థులు
- బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ
- 2024–25 విద్యాసంవత్సరంలో ఒక్క రూపాయి ఇవ్వని కూటమి ప్రభుత్వం
- కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా త్వరలో అందజేస్తామని ప్రకటనలతో సరి
- జిల్లాలో తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్న 3,23,711 మంది విద్యార్థులు
- ప్రైవేట్ పాఠశాలల ఒత్తిడితో ఫీజులు కట్టడానికి ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరుతో రూ.977.45 కోట్ల తల్లుల ఖాతాల్లో జమ

సాక్షి, నరసరావుపేట: టీడీపీ తన మేనిఫెస్టోలో తల్లికి వందనం పేరిట పాఠశాల, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాలలో వేస్తామని తెలిపారు. బడికి వెళ్లే పిల్లాడు ఒకరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు ... అంటూ కూటమి నేతలు ఊదరగొట్టారు. అయితే అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తన సహజ నైజాన్ని బయటపెట్టారు. తొలి ఏడాది ఇవ్వాల్సిన తల్లికి వందనం నిధులు ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. రెండో ఏడాది విద్యా సంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నది. ఇప్పటికీ డబ్బులెప్పుడిస్తారో చెప్పేవారు లేదు. కూటమి ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసిందని తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి చెప్పిన తేదీ ప్రకారం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో నేరుగా జమ అయ్యేవని గుర్తు చేసుకుంటున్నారు. అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

3,23,711 మంది విద్యార్థుల ఎదురుచూపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 అందజేస్తామని హామీనిచ్చారు. ఈ పథకం ప్రకారం పల్నాడు జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులందరికి ఒక్కొక్కరికి రూ.15వేలు అందజేయాల్సి ఉంది. పల్నాడు జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరం 3,23,711 మంది విద్యార్థులకుగాను ఏడాదికి రూ.485.56 కోట్లు అందజేయాల్సి ఉంది. ప్రస్తుతం 2025–26 విద్యాసంవత్సరం బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల ఖాతాలలో రెండేళ్ల నగదు జమ చేయాల్సి ఉంటుంది. అంటే సుమారు రూ.971.12 కోట్లు జమ చేయాల్సి ఉంది. ఇంతవరకు తల్లికి వందనం నిధులు విడుదల చేయలేదు. దీంతో పిల్లలను బడులకు పంపుతున్న తల్లిదండ్రులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా బడులు తెరచిన వెంటనే తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నిధులు జమ అయ్యేవి. ఇలా జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రూ.977.45 కోట్లు తల్లుల వ్యక్తిగత ఖాతాలలో జమ చేసింది.





ఇబ్బందిపడుతున్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ నెలలోనే అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థిని బడికి పంపుతున్న ప్రతి తల్లికి రూ.15 వేలను బ్యాంక్ ఖాతాలలో జమ చేసేవారు. దీంతో విద్యార్థులు బడులకు పంపడానికి ఆర్థికంగా వెసులుబాటు కలిగేది. ముఖ్యంగా ప్రైవేట్ బడులకు పంపేవారికి ఈ రూ.15 వేలు ఫీజులు కట్టడానికి ఉపయోగపడేది. విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు వంటి వస్తువులు కొనడానికి ఈ డబ్బులు ఉపయోగించేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఒక విద్యాసంవత్సరం పూర్తయితే మరొకటి ప్రారంభమైనా ఇంత వరకు తల్లికి వందనం నిధులు విడుదల చేయలేదు. ఇంకా ఎటువంటి కార్యాచరణ, ప్రాథమిక సర్వేలు చేయలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు అడుగుతున్నారని, ప్రభుత్వ త్వరగా నిధులు విడుదల చేస్తేనే కట్టగలమని చెబుతున్నారు. ఇప్పటికే పంటలు పండక, గిట్టుబాట ధరలు లభించక, మార్కెట్‌లో నగదు ప్రవాహం తగ్గడం వంటి కారణాలతో బడుగు, బలహీనవర్గాల కుటుంబాలకు ఈ విద్యాసంవత్సరం భారంగా మారింది. దీంతో వేలాది మంది విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదముందన్న ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది బడి మానేసిన విద్యార్థులు అమ్మ ఒడి పథకం ద్వారా తిరిగి బడి బాట పట్టారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా లబ్ధి పొందిన వారి సంఖ్య, ప్రభుత్వం చేసిన ఖర్చు ...

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రూ.కోట్లలో
2019–20	1,61,031	241.55
2020–21	1,72,772	241.88
2021–22	1,92,598	250.37
2022–23	1,87,417	243.64

జిల్లాలో నియోజకవర్గాల వారీగా తల్లికి వందనం పథకం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల సంఖ్య ...

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య
నరసరావుపేట	50,501
చిలకలూరిపేట	41,361
సత్తెనపల్లి	40,597
పెదకూరపాడు	39,685
గురజాల	51,551
మాచర్ల	50,613
వినుకొండ	49,403
మొత్తం	3,23,711

గతంలో నేరుగా బ్యాంక్ ఖాతాలలో జమ



మా అమ్మాయి ఈ ఏడాది ఐదో తరగతికి వెళ్లనుంది. గతేడాది తల్లికి వందనం నగదు జమ కాలేదు. ఈ ఏడాది ఇస్తామంటున్నారు, కానీ దానిపై ఎటువంటి స్పష్టత రాలేదు. త్వరగా ఆ డబ్బులు పంపిణీ చేస్తే పిల్లల చదువులకు ఉపయోగపడుతుంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాకు అమ్మ ఒడి పథకం ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేవి.

–సంగు రాజ్యలక్ష్మి, రాజుపాలెం

అప్పులు చేసి చదివిస్తున్నాం..



నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి మోక్షిత్‌రెడ్డి (11) ఆరో తరగతిలో చేరనున్నాడు. చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. అమ్మాయి జాహ్నవి(8) నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నాలుగో తరగతి చదవనుంది. సొంత ఇల్లు లేదు. టీ స్టాల్ నిర్వహించుకుంటూ జీవనాధారం పొందుతున్నాను. గతంలో మూడేళ్లపాటు ఏటా అమ్మ ఒడి సాయం అందింది. పిల్లలను చదివించుకోవడానికి ఊరట నిచ్చింది. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి అమ్మ ఒడి ఇస్తామని చెప్పారు. నేటికీ ఇంతవరకు అందలేదు. ప్రభుత్వం సాయం అందిస్తే పిల్లల చదువుకు ఆసరాగా ఉంటుంది. అప్పులు చేసి చదివించుకోవాల్సి వస్తోంది.

– ఉండేల రామకృష్ణారెడ్డి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు



సత్తెనపల్లిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- గద్దెనెక్కడానికి చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలు
- అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసుల బనాయింపు
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతంరెడ్డి

సత్తెనపల్లి: అవినీతిలో కూరుకుపోయి అస్తవ్యస్తమైన పరిపాలన చేస్తున్నందుకు వ్యతిరేకంగా ప్రజలకు వెన్నుపోటు పొడిచావు కాబట్టి వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నాడని వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అవ్వడానికి ఏకంగా మామకు ఎలా వెన్నుపోటు పొడిచావో ప్రజలు గమనించారన్నారు. ఈ రోజు యావత్ ప్రజానికానికి వెన్నుపోటు పొడుస్తున్నావు కాబట్టి, జాగ్రత్త అంటూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో తలపెట్టిన వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నోరు తెరవకుండా ఉండాలని, వందలాది మందిని హత్య చేయించాడని, వందలాది మందిపై హత్యా నేరాలు మోపాడన్నారు. వేలాది మందిపై కేసులు పెట్టడం పరాకాష్టకు చేరిందన్నారు. గ్రామాలు, ఇల్లు వదిలి వెళ్లే పరిస్థితి తెచ్చాడని, వాళ్ల చేసే అవినీతిని ఎవరూ ప్రశ్నించ కూడదనే పద్ధతిలో తీసుకొస్తున్నాడన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 4నాటికి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతుందని, కానీ ఏడాది కాలంలో ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, నాయకులు చిట్టా విజయభాస్కరరెడ్డి, పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, రాజారపు శివనాగేశ్వరరావు, రాయపాటి పురుషోత్తమరావు, భవనం రాఘవరెడ్డి, నక్కా శ్రీను, షేక్ మౌలాలి, మద్రి సుబ్బారెడ్డి, కళ్లం విజయభాస్కరరెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 158 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 158 అర్జీలు స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన వారిలో డీఆర్‌ఓ ఏకా మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్య వింటున్న కలెక్టర్

పింఛన్ పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోండి



ఆరో వార్డు బాబాపేటకు చెందిన మండ్ల మరియమ్మకు పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవు. అదే ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్‌బీ కుమారులు 35 ఏళ్ల ఇస్మాయిల్, 32 ఏళ్ల సుభానీ మరుగుజ్జులు. వారికి ప్రస్తుతం రూ.6వేల పింఛన్ అందుతుంది. తమకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని కోరేందుకు అర్జీలతో వచ్చారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కిందకు దిగి వారి వద్దకు వచ్చి అర్జీలను పరిశీలించి వెంటనే మెడికల్ బోర్డుకు సిఫార్సుచేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధులత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిలను ఆదేశించారు.

–కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగురాలు, మరుగుజ్జులు

వేధిస్తున్నా పట్టించుకోవట్లేదు



నేను కొన్నేళ్లుగా శ్రీనివాసనగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్నా. నాకు ఇద్దరు పిల్లలు. ఇదే నాకు జీవనాధారం. అదే సెంటర్‌లో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ నన్ను ఆకారణంగా వేధిస్తుంది. పిల్లలను తీసుకురావొద్దని, తీసుకొస్తే రేషన్ మిగలదని అంటూ నాపై దాడిచేస్తుంది. ఈరోజు సోమవారం కూడా దాడిచేసింది. గతంలో నాపై దాడి చేసినందుకు రెండుసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఆమెపై చర్యలు తీసుకోవాలని మరోసారి అర్జీ అందజేస్తున్నా. సీడీపీఓ ఉమామహేశ్వరి ఆమెను పిలిపించి మాట్లాడతానని చెప్పింది.

–సింధు నాగూభాయ్, అంగన్‌వాడీ ఆయా, నరసరావుపేట

అర్జీ ఇచ్చినా పట్టించుకోవట్లేదు



నాకు వారసత్వంగా లభించే పొలాన్ని వేరే వ్యక్తులు అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని పాస్‌బుక్‌లు పొందారు. వాటిని రద్దుచేసి ఆ పొలాన్ని హక్కుదారైన నా అత్తపేరుపై పెట్టించా. పాస్‌బుక్‌లు మంజూరు చేశారు. ఆమె తదనంతరం ఆ పొలం హక్కుదారులం మేమే. ఆమె మృతి చెందింది. అయితే ఆ పొలాన్ని ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకున్న వారు కోర్టుకు ఎక్కారు. ఎటువంటి హక్కులు లేని వ్యక్తులు పొలంలోకి మేము వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. వేసిన పంటను ధ్వంసం చేస్తున్నారు. దీనిపై 2024లో రెండుమార్లు అర్జీ అందజేశా. అధికారుల నుంచి సరైన స్పందనలేదు. మంగళగిరి వెళ్లి టీడీపీ కార్యాలయంలో అర్జీ అందజేశా. అక్కడి నుంచి ఫోన్‌చేసి రెవెన్యూ అధికారులకు చెప్పారు. అయినా ఇక్కడ అధికారులు ఎవరూ పట్టించుకోవట్లేదు. అందువలన మూడోసారి మళ్లీ అర్జీ అందజేస్తున్నా.

–ఉన్నం నాగేశ్వరరావు, ధర్మవరం గ్రామం, దుర్గి మండలం

గోవులను వధశాలకు తరలింపు నిలిపివేయాలి



క్రోసూరు సంతలో కొంతమంది వ్యక్తులు గోవులను కొనుగోలు చేసి వాటి కాళ్లు నరికి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆవుల వారిపాలెం వద్ద ఒక షెడ్డుకు చేర్చి మాంసానికి తరలిస్తున్నారు. ఐదారునెలలుగా రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వ్యాపారం చేశారు. భగవంతుని స్వరూపమైన ఆవులను చంపటం, సంతకు, వధశాలకు తరలించటం నిషేధించి వాటిని కాపాడాలి.

– వీహెచ్‌పీ గోరక్షణ్ జిల్లా ప్రముఖ్, నాయకులు

ఐదున జిల్లాలో రాష్ట్ర స్థాయి యోగాంధ్ర

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: యోగాంధ్ర మాసోత్సవ వేడుకలలో భాగంగా జూన్ ఐదు గురువారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం వేదికగా పదివేల మందితో రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. దీనికి పెద్ద ఎత్తున జిల్లా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో యోగాంధ్ర మాసోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ప్రముఖ పర్యాటక కేంద్రం నాగార్జున సాగర్ వద్ద ఒక వేయి మందితో సామూహిక యోగా నిర్వహిస్తామన్నారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద స్థానికులతో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

యోగా చేసిన వ్యవసాయ శాఖ ఉద్యోగులు



యోగాంధ్రలో భాగంగా సోమవారం పల్నాడు బస్టాండ్, పెద్దచెరువురోడ్డు వద్ద జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రవి మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. సుమారు 150 మంది దాకా వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టండి

రానున్న వర్షా కాలంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. వారం రోజులపాటు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు.

మాచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

మాచర్ల: పురపాలక సంఘ పూర్తి స్థాయి అధికారిక చైర్మన్‌గా పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదార్ సాహెబ్‌ను కౌన్సిల్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, జిలా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌ను ప్రభుత్వం నెలరోజుల కిందట తొలగించింది. అప్పటి నుంచి ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించిన మదార్ సాహెబ్‌ను పూర్తిస్థాయి చైర్మన్‌గా ఎంపిక చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పదో వార్డు కౌన్సిలర్ ఎర్రాకుల సిద్ధమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి వైస్‌చైర్మన్‌గా ఉన్న పోలూరి నరసింహారావు ఆ పదవికి కొన్ని రోజుల కిందట రాజీనామా చేశారు. ఈరెండు పదవులకు ఎన్నిక నిర్వహించాలని పురపాలక సంఘం ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం ఈ ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన మదార్‌సాహెబ్, వైస్ చైర్మన్ ఎర్రాకుల సిద్ధమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో మాచర్ల చిన్న ఏసోబు, పి.నరసింహారావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు యనమల కేశవరెడ్డి, పట్టణ నాయకులు ఎం.చిన్నవెంకట్రామిరెడ్డి, కె.దుర్గారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షయ రహిత సమాజమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

కార్యాలయంలో క్షయ వ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్, కరపత్రాలను కార్యాలయంలో సోమవారం కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. క్షయ పోషణ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. లక్షణాలు ఉన్నవారు సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకొని మందులు వాడాలని సూచించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, ఆర్డీవో కె.మధులత పాల్గొన్నారు.

జెడ్పీలో ఉద్యోగుల బదిలీలు

కౌన్సెలింగ్ ద్వారా 91 మందికి స్థాన చలనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో 91 మంది ఉద్యోగులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ వి.జ్యోతిబసు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ ఒక చోట ఐదేళ్లు విధులు నిర్వహించిన వారిని ఇతర ప్రాంతాలకు తప్పనిసరిగా బదిలీ చేస్తున్నామని, ఖాళీగా ఉన్న ప్రాంతాలకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బదిలీల్లో భాగంగా ఏడుగురు పరిపాలనాధికారులతో పాటు ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది టైపిస్టులు, ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లు, 39 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఒక నైట్ వాచ్‌మెన్ బదిలీ అయ్యారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, ఏఓ రాజారత్నం పాల్గొన్నారు.

అర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించండి

- ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర 63 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.



తన కుమారుడు కనిపించడం లేదని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న మహిళ

ప్రభుత్వ ఉద్యోగం పేరిట మోసం

పౌర సరఫరాల శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే మహిళా ఉద్యోగి మోసానికి పాల్పడింది. ఆమె మాయమాటలు నమ్మి నరసరావుపేటకు చెందిన ఇద్దరు సోదరులు రూ.34 లక్షలు అందజేశారు. గుంటూరు వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సదరు మహిళ మొదట నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లతో బాధితులను బురిడీ కొట్టించాలని ప్రయత్నించింది. బాధితులు విచారించగా అవి నకిలీవి అని తేలడంతో మహిళా ఉద్యోగిని నిలదీశారు. నగదు తిరిగి ఇవ్వాలని వారు కోరుతున్నా పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ వస్తుంది. మధ్యవర్తిగా వ్యవహరించిన సిహెచ్ శ్రీనివాసరావుపై బాధితులు ఒత్తిడి తీసుకురావడంతో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశాడు.

నగదు ఇవ్వకుండా వేధిస్తున్నాడు..

నా చిన్నకుమారుడు పొలం కొనుగోలు చేసేందుకు కావాలంటే రూ.20లక్షలు నగదు ఇచ్చాను. ఇప్పుడు నగదు ఇవ్వకుండా వేధిస్తున్నాడు. భర్త చనిపోయి కనీసం నడవలేని స్థితిలో ఉన్న తనకు న్యాయం చేయండి.

–ఇండ్లమూడి అన్నపూర్ణ, పెదరెడ్డిపాలెం, నరసరావుపేట మండలం

దొంత సంతకాలతో రిజిస్టర్

నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. ఇందులో ఒక ఎకరాన్ని దొంగ సంతకాలతో రిజిస్టర్ చేయించుకున్నారు. నకిలీ పత్రాలతో రిజిస్టర్ చేసుకున్న చిరుమామిళ్ల అమర్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరా. పొలంలోకి వెళ్తే అమర్‌బాబుకు దాడికి ప్రయత్నిస్తున్నాడు.

–నల్లజాల వెంకటేశ్వర్లు, మాదుగుల, గురజాల మండలం

ఆడబిడ్డ నుంచి ప్రాణహాని

నా ఆడబిడ్డ, ఆమె అల్లుడు నుంచి ప్రాణహాని ఉంది. నా భర్త శ్రీనివాసరెడ్డితో ప్రేమ వివాహం జరిగిందని, ఇది ఇష్టం లేక మాపై పలుమార్లు ఆడబిడ్డ, ఆమె అల్లుడు దాడులకు పాల్పడ్డారు. గ్రామంలోని సొంత ఇంటిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో రెంటచింతలలో నివాసం ఉంటున్నా. మాకు న్యాయం చేయండి.

–గార్లపాటి కమల, ఓబులేసునిపల్లి, దుర్గి మండలం

ప్రలోభపెట్టి డబ్బు కాజేశారు..

టెలిగ్రామ్ ఆప్‌లో వచ్చిన మెసేజ్ ఆధారంగా డబ్బులు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయనే ఆశతో రూ.71,700 పంపాను. ఆ తరువాత వారి నుంచి ఎటువంటి స్పందన లేదు. దీనిపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు హోల్డ్ చేయించాం. ప్రలోభపెట్టి డబ్బులు కాజేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

–వీరాంజనేయులు, వినుకొండ

డబ్బులు ఇవ్వకుండా కాలయాపన

మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. గ్రామానికి చెందిన నాగేంద్రబాబు అనే వ్యాపారి రూ.2.8లక్షలు ఇవ్వాల్సి ఉంది. నగదును ఇప్పించి న్యాయం చేయాలని కోరాడు.

–సీహెచ్ సాంబశివరావు, ధర్మవరం, దుర్గి మండలం

నా కుమారుడు కనిపించడం లేదు

లోన్ యాప్‌కు భయపడి నాలుగు నెలలుగా నా కుమారుడు నాగసాయి హేమంత్‌కుమార్ గుప్తా కనిపించకుండా వెళ్లిపోయాడు. హేమంత్‌కుమార్ మిస్సింగ్‌లో స్నేహితుల పాత్ర ఉన్నట్టు తెలిపింది. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకోవడం పట్ల ఆందోళనగా ఉంది.

–అరుణాదేవి, లంబాడీపేట, చిలకలూరిపేట

పొలం కౌలు ఇప్పించండి

పొలం కౌలుకు ఇప్పించి, రూ.7.24లక్షల నగదు ఇచ్చిన తనను అచ్చంపేట మండలం అంబడిపూడి గ్రామానికి చెందిన చదలవాడ హరికృష్ణ, రమణ సోదరులు అప్పు చెల్లించకుండా బెదిరిస్తున్నారు. నాకు న్యాయం చేయండి.

–పారువల్లి నరసింహారావు, అంబడిపూడి, అచ్చంపేట మండలం

పోలీసుల తీరు హేయం

తెనాలిరూరల్: దళిత, మైనార్టీ యువకులపై జనావాసాలు మధ్య బహిరంగంగా, కర్కశంగా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అన్నారు. తెనాలిలో సోమవారం ఆయన మాట్లాడారు. ముగ్గురు బాధితులను అమానుషంగా హింసించడంపై ప్రజా హక్కులు సంఘాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయన్నారు. పోలీసుల చర్యలను సమర్థిస్తూ బాధిత యువకులపై ఎలాంటి గాయాలు లేవని తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన డాక్టర్లతో పాటు సాక్షులుగా ఉన్న వీఆర్వోలను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెనాలి బార్ అసోసియేషన్ బేతాళ ప్రభాకర్, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కొరివి వినయ్ కుమార్, తెనాలి జేఏసీ అధ్యక్షుడు బొనిగల ప్రదీప్, తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్, న్యాయవాదులు గుంటి సురేష్ బాబు, గుమ్మడి రవిరాజు, కంచర్ల కోటేశ్వరరావు, కనపర్తి కుటుంబరావు, పెనుమాక మధు, దోమ రమేష్ రాంజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతకుమార్, న్యాయవాదులు

ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

- ఓవరాల్ ఛాంప్ ఎన్టీఆర్ జిల్లా
- రన్నర్స్‌గా కర్నూలు జిల్లా

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల 11వ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్– 2025 పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. రన్నర్స్ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఈ పోటీలలో పురుషుల వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.శరత్ (ఎన్టీఆర్ జిల్లా) సాధించగా, మహిళల విభాగంలో సన్వి కొంగర, యు.ప్రేమాంమృత (ఎన్టీఆర్‌జిల్లా) సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించిన పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. పోటీలలో భాగంగా ఎంపిక చేసిన రాష్ట్ర స్విమ్మింగ్ జట్టు క్రీడాకారులు త్వరలో ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, వెంకట్‌రామ్మోహన్, పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు డాక్టర్ ఏ.ఏ.రామలింగారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌గా కప్పు అందుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు



రన్నరప్‌గా నిలిచిన కర్నూలు జిల్లా క్రీడాకారులు

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్

లక్ష్మీపురం: వ్యసనాలకు అలవాటు పడిన భర్తను వదిలి పుట్టింట్లో ఉంటూ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న మహిళను ఆమె భర్త కత్తి పొడిచి గాయాలపాలు చేశాడు. నిందితుడిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేటకు చెందిన మెరిగల రాజేష్, కల్పనకు 2014లో వివాహం అయింది. రాజేష్ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే కొంతకాలంగా రాజేష్ వ్యసనాలకు అలవాటు పడి మద్యం సేవిస్తూ భార్యను వేధించడం ప్రారంభించాడు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక కల్పన ఏడాది క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలను పోషించేందుకు చంద్రమౌళినగర్‌లోని సంస్థలో చిరు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అయితే రాజేష్ మద్యం సేవించి పిల్లలు కావాలంటూ, కాపురానికి రావాలంటూ భార్య పని చేసే ప్రదేశానికి వెళ్లి వేధిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గత నెల 25న రాత్రి ఆమె పనిచేసే ప్రదేశానికి వెళ్లి వాగ్వ్వాదానికి దిగిన రాజేష్ వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి తీవ్ర గాయాలపాలు చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు కల్పనను హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటన జరిగిన ప్రదేశంలో విచారించి, బాధితురాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాడు. నిందితుడు ఉడాయించడంతో అతనికోసం గాలింపు చేపట్టారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ తరంగిణిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కోబాల్ట్‌పేట 7వ లైన్‌లో నిందితుడు ఉన్నట్లు తెలియడంతో మెరిగల రాజేష్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ తరంగణి, వెనుక నిందితుడు

స్పైసెస్ బోర్డు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఎగుమతులు, విలువ జోడింపు – రైతు సాధికారతను పెంచడానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్పైసెస్ బోర్డు స్పైసెస్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తోందని స్పైసెస్ బోర్డు డీడీ ఆనంద్ దేవ్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పైసెస్ బోర్డు 2025–26 ఆర్థిక సంవత్సరానికి 'ఎగుమతి అభివృద్ధి కోసం ప్రగతిశీల, వినూత్న, సహకార జోక్యాల ద్వారా సుగంధ ద్రవ్యాల రంగంలో స్థిరత్వం' అనే ప్రధాన పథకం కింద ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందన్నారు. స్థిరత్వం, ఆవిష్కరణ, ఎగుమతి అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా భారతీయ సుగంధ ద్రవ్యాల రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ మే నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైందని, సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారుల కోసం స్పైస్డ్ పథకం యొక్క ఎగుమతి అభివృద్ధి, ప్రమోషన్ భాగాల కింద దరఖాస్తును ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వాటాదారులు www.indianspices.com ను సందర్శించి దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్లడించారు.

సుద్ధపల్లిలో వ్యక్తి దారుణహత్య

వివాహేతర సంబంధమే కారణం



మృతుడు కొమ్మూరి గోపయ్య(ఫైల్)



సుద్ధపల్లిలో కొమ్మూరి గోపయ్య హత్యపై విచారిస్తున్న ఎస్ఐ డి.వెంకటకృష్ణ

చేబ్రోలు: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సోమవారం సుద్ధపల్లిలో చోటుచేసుకుంది. చేబ్రోలు మండలం సుద్ధపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి గోపయ్య (35)ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హతమార్చారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చేబ్రోలు సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి తల్లి కొమ్మూరి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకటకృష్ణ తెలిపారు. మహిళకు ఇద్దరు వ్యక్తులతో ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం కారణంగానే ఈ హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

వేటపాలెం: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. స్థానిక రామన్నపేట శివారులోగల కనక నాగవరపమ్మ దేవస్థానం సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందన్నారు. మృతురాలికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. మహిళ మృతి చెంది కొన్ని రోజులై ఉంటుందని తెలిపారు. మృతదేహం బాగా పాడైపోయి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా..ఐదుగురికి గాయాలు

ఉలవపాడు: కారు అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై రాజుపాలెం జంక్షన్ వద్ద సోమవారం ఈ సంఘటన జరిగింది. వివరాలు... గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సీహెచ్.బాలభాస్కర్ కుటుంబ సభ్యులు, బంధువులు కలసి ఏడుగురు కారులో అరుణాచలానికి బయలుదేరారు. అందరూ మాట్లాడుకుంటూ సంతోషంగా వెళుతున్న సమయంలో రాజుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న వారిలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఏ.విజయలక్ష్మి, లక్ష్మీవాణి, కామాక్షి, బాలభాస్కర్, సీతారావమ్మలకు గాయాలు కాగా వీరిని హైవే అంబులెన్స్ సిబ్బంది ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు.

ఆత్మరక్షణ కోసం ఆయుధం

- కర్రసాము, తైక్వాండోల్లో రాణిస్తున్న చిన్నారులు
- అంతర్జాతీయ పోటీల్లో పతకాల పంట
- మారుతున్న తల్లిదండ్రుల ఆలోచన ధోరణి



చిన్నారులకు శిక్షణనిస్తున్న కోచ్ కాశీనాథ్ రెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రతి చిన్న సమస్యని పెద్దదిగా చూడడం, ఆందోళన చెందడం, క్రమశిక్షణ లోపించడం తదితర అంశాలను నేటిచిన్నారుల్లో తరచూ చూస్తుంటాం. తల్లిదండ్రుల్లో కూడా తమ పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యతనిచ్చి పెద్ద కళాశాలల్లో సీట్లు సాధించాలనే తపన ఎక్కువగా కనిపిస్తుంది. అయితే కొందరు మాత్రం తమ పిల్లల్ని విద్యావంతులుగానూ ఆత్మ రక్షణ విద్యలోనూ మేటిగానూ చూడాలనుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగా శిక్షణా శిబిరాల్లో చేర్పించి దీటుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలా శిక్షణ పొందిన కొందరు చిన్నారులు పోటీల్లోనూ రాణిస్తున్నారు. గుంటూరు విద్యానగర్‌లోని కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సుమారు 100 మందికిపైగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ అద్భుతంగా రాణిస్తున్నారు. గత నెల 24 నుంచి 26 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన 5వ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 9 బంగారు, 5 రజతాలు 3 కాంస్య పతకాలు సాధించి ఔరా అనిపించారు. అకాడమీ కోచ్ కాశీనాథ్ రెడ్డి ప్రత్యేక శిక్షణలో రాటుదేలుతున్న వీరు కర్రసాముతోపాటు తైక్వాండాలోనూ విశేషంగా రాణిస్తున్నారు.

ఆర్మీలో చేరతాను



అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించాను. తైక్వాండాలో 2వ డాన్ బ్లాక్ బెల్ట్. నేషనల్ మెడల్స్ కూడా ఉన్నాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధన చేస్తున్నాను. నిత్యం ఫిట్‌గా ఉండడంతో ఒత్తిడి ఉండదు. గత 5 సంవత్సరాలుగా సాధన చేస్తున్నాను. ఆర్మీలోగానీ, పోలీస్ శాఖలోగానీ చేరతాను.

– బి.హర్షవర్ధిని, 10వ తరగతి

ఫిట్‌గా ఉంటాను



నాకు అలసట ఉండదు. ఎన్ని గంటలైనా క్లాస్‌లో బోర్ కొట్టకుండా కూర్చుంటాను. కర్రసాము, తైక్వాండో సాధన కారణంగా ఆ శక్తి నాలో ఉంటుంది. 2వ డాన్ బ్లాక్‌బెల్ట్‌తోపాటు కర్రసాములోనూ పతకాలు సాధించాను. పోలీస్ ఉద్యోగమంటే చాలా ఇష్టం.

– డి.శ్రవంత్ కుమార్, 10వ తరగతి

తెలియని ధైర్యం



మార్షల్ ఆర్ట్స్ సాధనతో తెలియని ధైర్యం ఉంటుంది. కోచ్ శిక్షణతోపాటు మెడిటేషన్, ఎథిక్స్ గురించి చెబుతుంటారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తాను. అంతర్జాతీయ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు వచ్చాయి. తైక్వాండోలో 2వ డాన్ సాధించాను. అమ్మ నాన్న కూడా బాగా ప్రోత్సహిస్తారు. ఆర్మీలో చేరి, దేశ సేవ చేస్తాను.

– వి.హంసిని మీనాక్షి, 10వ తరగతి

పతకాలు ఆత్మ స్థైర్యాన్ని పెంచాయి



ఇటీవల ముగిసిన అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించాను. ఆ విజయం నాలో ఆత్మ స్థైర్యాన్ని పెంచింది. తైక్వాండాలోనూ జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించాను. 2వ డాన్ బ్లాక్ బెల్ట్ ఉంది. నిత్యం సాధన కొనసాగిస్తుంటాను. మరిన్ని పోటీలకు సిద్ధపడుతున్నాను.

– బి.రమ్యశ్రీ రెడ్డి, 7వ తరగతి

తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది



నేను 20 ఏళ్ల నుంచి తైక్వాండో, 8 సంవత్సరాల నుంచి కర్రసాము నేర్పిస్తున్నాను. ప్రస్తుతం 100 మంది పిల్లలున్నారు. ఈ మధ్య తల్లిదండ్రుల ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. తమ పిల్లలను క్రీడా, ఆత్మరక్షణ శిక్షణకు తీసుకువస్తున్నారు. అదే విధంగా రిజల్ట్ కూడా ఉంటుంది. మా అకాడమీ పిల్లలు సాధనతోపాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభకనబరుస్తున్నారు.

– బి.కాశీనాథ్ రెడ్డి, చీఫ్ కోచ్, గుంటూరు